గుమ్మడిదల: బొంతపల్లిలో శోభాయాత్రను నిర్వహిస్తున్న భక్తులు



పటాన్‌చెరు: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

ఘనంగా హనుమాన్ జయంతి

గుమ్మడిదల, జూన్ 1: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఊరూరా శోభాయాత్రలు, బైక్ ర్యాలీలు, హోమాలతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలోని గుమ్మడిదల, బొంతపల్లి, వీరన్నగూడెం, అన్నారం, దోమడుగు, కానుకుంట, నల్లవల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. బొంతపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ నాగేందర్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కిరణ్‌కుమార్ శర్మ మన్యుసూక్తంతో హోమాన్ని నిర్వహించారు. అనంతరం భజనలు, బైక్‌ర్యాలీ నిర్వహించారు. అలాగే బొంతపల్లి, వీరన్నగూడెంలో యువకులు వీరభద్రస్వామి ఆలయం నుంచి బొంతపల్లి, వీరభద్రనగర్ కాలనీల మీదుగా శోభాయాత్రను నిర్వహించారు. అన్నారం, దోమడుగు తదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, తిరుమలవాసు, రాజశేఖర్, చంద్రశేఖర్, గణేశప్పా, వినోద్‌గౌడ్, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం: ఆంజనేయ స్వామిని దర్శించుకున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

జిన్నారంలో..

జిన్నారం, జూన్ 1 : మండల పరిధిలో హనుమాన్ జయంతిని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిన్నారం, మంగంపేట, మాదారం గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పటాన్‌చెరులో ఎమ్మెల్యే పూజలు

పటాన్‌చెరు, జూన్ 1: పటాన్‌చెరులో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. పట్టణంలోని పంచముఖి హనుమాన్ స్వామి, ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీల సభ్యులు సన్మానించారు. పటాన్‌చెరు కార్పొరేటర్ కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకలు

రామచంద్రాపురం, జూన్ 1: ఆర్సీపురం, భారతీనగర్ డివిజన్లతో పాటు తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆలయాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని హనుమాన్ ఆలయాన్ని కార్పొరేటర్ పుష్పానగేశ్ సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు.

కందిలో..

కంది, జూన్ 1: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

హనుమాన్‌చాలీసా పారాయణం

నారాయణఖేడ్, జూన్ 1 : పట్టణంలోని కల్పనాంజనేయ స్వామి ఆలయంలో శనివారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో 101వ వారం హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మర్పల్లి రాంరెడ్డి మాట్లాడుతూ ఆంజనేయస్వామి గొప్పతనం, హనుమాన్‌చాలీసా విశిష్టతను వివరించారు.

విత్తన ఎంపికే కీలకం

- నకిలీ విత్తనాలతో తస్మాత్ జాగత్ర
- రసీదులు తప్పనిసరి తీసుకొని భద్రపరుచుకోవాలి
- తగిన జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు



బొడిశెట్‌పల్లిలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో లావణ్య(ఫైల్)

మునిపల్లి, జూన్ 1: వానకాలం సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించకపోతే మొదటికే మోసం వచ్చే ప్రమాదమున్నది. విత్తనాలు కొనేటప్పుడు రైతులు అప్రమత్తంగా ఉండాలి. రైతుల హడావిడిని ఆసరా చేసుకొని కొందరు వ్యాపారులు నకిలీ, నాసిరకం విత్తనాలను అంటగట్టే పనిలో ఉంటారు. విత్తనాలు కొనడమే తప్ప వాటి స్థితిగతులను గమనించకపోవడంతో రైతులు ఏటా నష్టాలబారిన పడుతున్నారు. పత్తి విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. లేనియెడల తీవ్ర నష్టాన్ని చూడాల్సి వస్తుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

తక్కువ ధరకు వస్తుందని నమ్మొద్దు

మండల రైతులు వానకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. మండల పరిధిలో ఎక్కువ మంది రైతులు పత్తి పంటను అధికంగా సాగు చేస్తారు. వర్షాలు మొదలవడంతో రైతులు విత్తనాల కోసం ఫర్టిలైజర్ దుకాణాలకు పరుగులు పెడుతున్నారు. దీన్ని అదునుగా చేసుకొని కొందరు వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలను అంటగట్టే ప్రమాదం ఉంటుంది. తక్కువ ధరకు వస్తుందని కొనుగోలు చేస్తే తర్వాత పెట్టుబడి పెరిగి దిగుబడి తగ్గితే నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. రైతులు చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే నకిలీ విత్తనాల బారి నుంచి బయటపడవచ్చు.

అధికారుల తనిఖీలు అవసరం

మునిపల్లి మండలంలో విచ్చలవిడిగా ఫర్టిలైజర్ దుకాణాలు దర్శనమిస్తున్నాయి. అందులో ఎన్ని దుకాణాలకు అనుమతులు ఉన్నాయో.. అనుమతులు లేకుండా ఎన్ని కొనసాగుతున్నాయో ఎవ్వరికి తెలవని అంశం. రైతులు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే మండలంలోని సంబంధిత శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తూ నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి. గతంలో మునిపల్లి మండలంలోని బుధేరా చౌరస్తాకు సంబంధించిన ఓ వ్యాపారి రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా సంబంధిత శాఖ అధికారులు తనిఖీ చేపట్టి స్టాక్ రిజిస్టర్స్‌ను పరిశీలించాలి.

ఇలా చేయాలి..

- ప్రభుత్వ గుర్తింపు ఉన్న దుకాణంలో మాత్రమే విత్తనాలు కొనాలి.
- తక్కువ ధరకు వస్తున్నాయని ప్రైవేటు వ్యక్తుల నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తే మొదటికే మోసం వస్తుంది.
- విత్తనాలు కొనుగోలు చేసిన అనంతరం దుకాణాదారుల నుంచి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి.
- విత్తనాలు ఏ సంస్థకు చెందినవో ప్యాకెట్‌పై ఉన్న లేబుల్ నంబరు, టాల్ నంబర్ రసీదుపై నమోదు చేసుకోవాలి.
- ముందస్తుగా విత్తనాలు మొలకెత్తే శాతాన్ని ప్యాకెట్‌పై చూసుకొని కొనుగోలు చేసి పంట పొలాల్లో విత్తుకోవాలి
- పంటను విత్తిన తర్వాత తప్పనిసరిగా విత్తన ప్యాకెట్లను, రసీదులను భద్రపరుచుకోవాలి.
- దుకాణాల్లో, గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే వెంటనే వ్యవసాయాధికారికి సమాచారమివ్వాలి.

అవగాహన తప్పనిసరి

విత్తనాలపై రైతులు తప్పనిసరిగా అవగాహన పెంపొందించుకోవాలి. కొన్ని ప్యాకెట్‌లో ఉన్న విత్తనాలు ఎంత శాతం మొలకెత్తుతాయో చూసుకోవాలి. అలాగే పంటకాలం పూర్తయ్యేవరకు రైతులు కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకెట్లతో పాటు రసీదులను తప్పకుండా తీసుకొని జాగ్రత్తగా ఉంచుకోవాలి. నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దు. కచ్చితంగా ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. మండలంలోని ప్రతి డీలర్ ఫర్టిలైజర్ దుకాణానికి సంబంధించి తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలి. లైసెన్స్ ఉన్న వారు ఖచ్చితంగా రెన్యూవల్ చేయించుకోవాలి.

– శివకుమార్,
వ్యవసాయాధికారి, మునిపల్లి

కేసులు నమోదు చేస్తాం

రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే సంబంధిత దుకాణం వ్యాపారిపై కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తాం.రైతులను మోసం చేసేందుకు ప్రయత్నం చేసే వారు ఎంతటివారైనా వదిలిపెట్టం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.కష్టాన్ని నమ్ముకుని బతికే రైతులకు నష్టం చేయ్యాలి అనకోవడం సరికదన్నారు. ఫర్టిలైజర్ దుకాణదారులు మండలంలో రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తాం.

– సురేశ్, మునిపల్లి, ఎస్సై

ఎన్నికల సిబ్బందికి హాజరు పత్రాలివ్వాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 1: ఎంపీ ఎన్నిక ల్లో విధులు నిర్వహించిన సిబ్బందికి హాజరు ధ్రువపత్రాలు ఇవ్వాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డి నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారికి వినతి పత్రం అందజేశారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పటాన్‌చెరు, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ కేంద్రాల్లో హాజరు ధ్రువపత్రాలు ఎన్నికలు జరిగిన రోజే అందించారని తెలిపారు. సంగారెడ్డి నియోజకవర్గ కేంద్రం లో ఇప్పటివరకు ఇవ్వలేదని, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, నాయకులు శ్రీనివాస్, మహేశ్వర్, విశ్వనాథం, మహిపాల్, శివకుమార స్వామి, రవీందర్ పాల్గొన్నారు.

రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేసిన టీపీటీఎఫ్ నాయకులు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి వల్లూరి

బడిబాట విజయవంతం చేయాలి

కలెక్టర్ క్రాంతి వల్లూరి

చౌటకూర్, జూన్ 1: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి అన్నారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్, సరాఫ్‌పల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పిల్లలు ప్రైవేట్‌లో కాకుండా సర్కారు బడుల్లో చేర్పించేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, తహసీల్దార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

- జూలై ఒకటి నుంచి అమల్లోకి..
- పోలీసులకు శిక్షణా తరగతులు
- ఎస్పీ చెన్నూరి రూపేశ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి, జూన్ 1 : దేశ వ్యాప్తంగా జూలై ఒకటి నుంచి కొత్త చట్టాలు అమలు కానున్నాయని ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. వీటిపై పోలీసు అధికారులకు అవగాహన ఉండాలన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన చట్టాలపై అవగాహన కల్పించేందుకు అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి రాధాకృష్ణ చవాన్ హాజరై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జూలై ఒకటి నుంచి దేశవ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదన్నారు. ఈ చట్టాలపై అవగాహన కల్పించేందుకు జిల్లాలోని పోలీసులందరికీ విడుతల వారీగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం–2023లపై పూర్తి అవగాహన ఉన్న పుడే సమర్థవంతంగా విధులు నిర్వహిస్తారని తెలిపారు. భారత న్యాయ వ్యవస్థ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నదని, అవసరాల మేరకు ప్రజా భద్రత కోసం ఎన్నో చట్టాలు రూపకల్పన చేసిందని ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవ్‌రావ్, ఎస్‌హెచ్‌వోలు, ఎస్సైలు, స్టేషన్ రైటర్స్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్స్ మల్లేశ్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, లా లూనాయక్, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, జూన్ 1 : తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామాల కమిటీల అధ్యక్షులు, కార్యకర్తలు కలిసి జెండాలను ఎగుర వేయాలని కోరారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచనల మేరకు జాతీయ జెండాలతో పాటు బీఆర్ఎస్ గులాబీ జెండాలను ఆవిష్కరించాలని సూచించారు.

జాతీయ జెండాలు ఎగురవేయాలి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 1 : నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 2న తెలంగాణ అవతరణ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలతో బీఆర్ఎస్ జెండాలను ఎగురవేయాలన్నారు. నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు జెండా విష్కరణ ఉంటుందని తెలిపారు. పార్టీ శ్రేణులు ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా నిర్వహిస్తాం

గుమ్మడిదల, జూన్ 1 : రాష్ట్ర అవతరణ వేడుకలను ఆదివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంపీపీ సద్ది ప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు పంచాయతీ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం

రామచంద్రాపురం, జూన్ 1: పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఏకే ఫౌండేషన్ అండగా నిలిచింది. ఆర్సీపురం డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్న షేక్ మహ్మద్ కూతురు హజీరాబేగం వివాహానికి ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖదీర్ రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు వివరించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే ఉపేక్షించం

హత్నూర, జూన్ 1 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో వసంతకుమారి హెచ్చరించారు. శనివారం హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విత్తనాలు అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫర్వీన్‌షేక్, ఎస్సై సుభాశ్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఝరాసంగం, జూన్ 1: మండల వ్యవసాయ అధికారులతో కలిసి తహసీల్దార్ సంజీవరావు మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. మందుల స్టాక్ వివరాల రికార్డులు పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి వెంకటేశం, ఏఈవో సుకుమార్, హరికృష్ణ, పోలీస్ సిబ్బంది, డీలర్లు నవాజ్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, విజయ్ కుమార్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

హత్నూర: దౌల్తాబాద్‌లో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసిన ఆర్డీవో వసంతకుమారి

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

మనూరు, జూన్ 1 : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని మనూరు ఎస్సై అంబర్యనాయక్ అన్నారు. శనివారం మనూరు మండల కేంద్రంలోని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

నారాయణఖేడ్, జూన్ 1: పట్టణంలోని అన్నదాత ఫర్టిలైజర్ దుకాణాన్ని శనివారం ఆర్డీవో అశోక చక్రవర్తి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు.

గుమ్మడిదలలో..

గుమ్మడిదల, జూన్ 1 : మండల పరిధిలోని ఫర్టిలైజర్ షాపులను తహసీల్దార్ గంగా భవాని, వ్యవసాయ అధికారి శ్రీనివాస రావు, ఎస్సై మహేశ్‌రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

ఇంటింటికీ డీసీసీబీ సేవలు



గుమ్మడిదల: భరోసా డిపాజిట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంకు సిబ్బంది, రైతులు

గుమ్మడిదల, జూన్ 1 : సహకార బ్యాంకు భరోసా డిపాజిట్ చేసి ఉచితంగా బీమా సౌకర్యాన్ని పొందాలని డీసీసీబీ మేనేజర్ లలిత అన్నారు. శనివారం స్థానిక డీసీసీ బ్యాంకు ఎదుట జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేండ్ల బాలబాలికల పేర్లపై సహకార బ్యాంకు భరోసా డిపాజిట్ చేస్తే 9 ఏండ్లలోపు రెట్టింపు పొందే సౌకర్యం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాములు తెలిపారు. సిర్గాపూర్ మండల కేంద్రంలోని డీసీబీ బ్రాంచ్‌లో ఇంటింటికీ డిపాజిట్ సేకరణ మాసోత్సవంలో భాగంగా శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో స్థానిక బ్రాంచి మేనేజర్ రవి, ఏపీఎం చంద్రశేఖర్, సీసీ హన్మాండ్లు, రైతు మొగులప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుల్కల్‌లో..

పుల్కల్, జూన్ 1 : ఇంటింటికీ డీసీసీబీ మాసోత్సవాల పథకాన్ని బ్రాంచ్ మేనేజర్ శ్రీలత శనివారం స్థానిక బ్యాంకులో ప్రారంభించారు. బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులతో కలిసి కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలబాలికలు, సీనియర్ సిటిజన్‌లకు డిపాజిట్లపై 8.25 వడ్డీ లభిస్తుందన్నారు. కొత్త ఖాతాదారులందరికీ రూ.2లక్షల ఉచిత బీమా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి దీపక్‌కుమార్, మానస, సిబ్బంది ఉన్నారు.

'భరోసా'ను సద్వినియోగం చేసుకోవాలి

సిర్గాపూర్, జూన్ 1 : భరోసా డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బొక్కస్‌గాం పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాములు తెలిపారు. సిర్గాపూర్ మండల కేంద్రంలోని డీసీబీ బ్రాంచ్‌లో ఇంటింటికీ డిపాజిట్ సేకరణ మాసోత్సవంలో భాగంగా శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో స్థానిక బ్రాంచి మేనేజర్ రవి, ఏపీఎం చంద్రశేఖర్, సీసీ హన్మాండ్లు, రైతు మొగులప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హత్నూరలో..

హత్నూర, జూన్ 1 : డీసీసీబీ ఆధ్వర్యంలో డిపాజిట్ సేకరణ మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దౌల్తాబాద్ బ్యాంకు మేనేజర్ ప్రవీక తెలిపారు. శనివారం దౌల్తాబాద్ బ్యాంకులో డిపాజిట్ సేకరణ మహోత్సవ వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు డీసీసీబీ అందిస్తున్న పలు రకాల సేవలు పొందేందుకు ఖాతాదారులుగా చేరాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వినయ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ యాకూబ్‌పాషా, కాసాల పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, సీతవాలు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

కంది సెంట్రల్ జైల్ తనిఖీ

కంది, జూన్ 1: కందిలోని సెంట్రల్ జైల్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానీ చంద్ర శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైల్‌లోని ఖైదీల బరాక్‌లు, సదుపాయాలు, వంటశాల తదితర వాటిని పరిశీలించారు. ఖైదీల కోసం వండే కూరగాయాలు, బియ్యం, పప్పు దినుసులను పరిశీలించడంతో పాటు వారి కోసం సిద్ధం చేసిన భోజనాన్ని రుచి చుశారు. జైలులో కావాల్సిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తనిఖీలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్, ట్రైనీ జడ్జిలు ధన లక్ష్మి, కృష్ణవేణి, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్స్ దేవదాస్, రత్నాకర్, బాబు, వెన్నెల, జైల్ సూపరింటెండెంట్ భరత్ ఉన్నారు.

ఖైదీలకు వడ్డించే భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

మొక్కలను సంరక్షించాలి

న్యాల్‌కల్, జూన్ 1 : మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలని జహీరాబాద్ డివిజన్ పంచాయతీ అధికారి అమృత కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని ఖలీల్‌పూర్, మీర్జాపూర్ (బి), గంగ్వార్, హుస్సేల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలో హరితహారం మొక్కల పెంపకం పనులతో పాటు పల్లె ప్రకృతి వనం, డంపింగ్‌యార్డ్, శ్మశాన వాటిలను ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో సురేశ్, పంచాయతీ కార్యదర్శులు శిల్ప, గాయత్రీ, నాగభూషణం, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మురుగు కాల్వలో శిశువు మృతదేహం లభ్యం

బొల్లారం, జూన్ 1 : బొల్లారం కుడికుంట సమీపంలోని మురుగు కాల్వలో నవజాత శిశువు మృతదేహం లభ్యమైందని పోలీసులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకొని శిశువు మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు చెప్పారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గన్‌పార్క్‌కు గులాబీ దండు

బొల్లారం, జూన్ 1 : తెలంగాణ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని బొల్లారం మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో నగరంలోని గన్‌పార్క్‌కు తరలి వెళ్లారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ క్రికెట్ గ్రౌండ్స్ నుంచి గన్‌పార్క్‌కి ర్యాలీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో వసతుల కల్పన

రాయికోడ్, జూన్ 1: గ్రామాల్లో ప్రభుత్వం కల్పించిన మౌలిక వసతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని జహీరాబాద్ డీఎల్‌పీవో అమృత అన్నారు. శనివారం మండల పరిధిలోని కూస్నూర్, రాయికోడ్‌లో వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, వన నర్సరీలను పరిశీలించారు. ఎంపీడీవో ఎంఎం శరీఫ్, ఎంపీవో అంజలీదేవి, పంచాయతీ కార్యాదర్శులు గోవింద్ రావు, మల్లేశం, సరిత పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

సిర్గాపూర్, జూన్ 1: బొక్కస్‌గాం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం కార్యాలయంలో శనివారం మండల వ్యవసాయాధికారి శశాంక్ రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. అవసరమున్న రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొచ్చి విత్తనాలు తీసుకోవాలన్నారు. సొసైటీ సీఈవో సతీశ్‌పాటిల్, ఏఈవో భార్గవచారి, బీటీఎం మారుతీరెడ్డి ఉన్నారు.

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

కల్హేర్, జూన్ 1 : పీఏసీఎస్ పరిధిలోని గ్రామాల్లోని రైతులు యాసంగిలో పండించిన జొన్నలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని బా